కొమురవెల్లి మల్లన్న కల్యాన్ని జరిపిస్తున్న అర్చకులు.. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

వైభవంగా మల్లన్న కల్యాణం

చేర్యాల, జనవరి 7: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ తోటబావి ప్రాంగణం కల్యాణ వేదిక వద్ద నిర్వహించిన కల్యాణోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించారు. ముత్యాల తలంబ్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి సమర్పించారు. కల్యాణోత్సవం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగ రాజు దేశికేంద్ర శివాచార్యుల స్వామీజీ పర్యవేక్షణలో జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కొమురవెల్లి క్షేత్రానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. స్వామివారి తరపున పడిగన్న గారి వంశస్థులు, అమ్మవార్ల తరపున మహాదేవుని వంశస్థులు పాల్గొని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

బేగంపేట్ మెట్రోభవన్‌లో
సీఎం క్యాంపు ఆఫీస్!

- సెక్యూరిటీ, ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం
- త్వరలో ఖాళీ కానున్న మెట్రో భవన్‌లోని కార్యాలయాలు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): సీఎం క్యాంపు కార్యాలయం కోసం బేగంపేట్‌లోని మెట్రో భవనాన్ని ఖరారు చేసినట్టు సమాచారం. రెండు మూడు ప్రత్యామ్నాయాలను పరిశీలించినప్పటికీ అవి ట్రాఫిక్, సెక్యూరిటీపరంగా అనుకూలంగా లేక చివరికి మెట్రో భవన్ అయితే అనుకూలంగా ఉంటుందనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. గతంలో సీఎం క్యాంపు కార్యాలయంగా ఉన్న ప్రగతిభవన్‌ను ఇతర అవసరాలకు వినియోగిస్తుండటంతో కొత్తగా సీఎం కోసం క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం సీఎం స్వయంగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనాన్ని పరిశీలించి అక్కడే ఖాళీ స్థలంలో క్యాంపు కార్యాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందులో ఉద్యోగులు, అధికారులకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతుంటాయి. అక్కడినుంచి సచివాలయం వరకు ఉండే రోడ్డు అత్యంత ట్రాఫిక్ రద్దీతో ఉంటుంది. దీంతో క్యాంపు కార్యాలయానికి వచ్చిపోయే సందర్శకులతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ సందడిగా మారే అవకాశం ఉండటంతో మరోచోట క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మూడు రోజుల క్రితం సీఎం నానక్‌రామ్‌గూడలోని గ్రోత్ కారిడార్ భవనాన్ని సందర్శించి క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ భవనంలో సెక్యూరిటీ పరంగా సమస్యలు తలెత్తే అవకాశమున్నదని అధికారవర్గాలు తెలిపాయి. దీంతో చివరగా బేగంపేట్‌లోని మెట్రో భవన్‌ను క్యాంపు కార్యాలయంగా ఏర్పాటుచేయాలని నిర్ణయానికి వచ్చారు. ఇది సచివాలయం, అసెంబ్లీకి దగ్గరగా ఉండటం వల్ల సీఎం రాకపోకలకు కూడా సౌకర్యంగా ఉంటుందని, ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా మినిస్టర్ రోడ్డు, నెక్లెస్‌రోడ్డులమీదుగా సచివాలయానికి తేలిగ్గా చేరుకోవచ్చని ఈ భవన్‌ను ఎంపికచేసినట్టు తెలిసింది. త్వరలోనే మెట్రో భవన్‌లోని కార్యాలయాలను ఖాళీ చేయించి అవసరమైన మార్పులు చేర్పులు చేయడం ద్వారా క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

సమాచారమివ్వకుండానే హైకోర్టుకు భూమి

చెప్పాపెట్టకుండా భూమి లాగేసుకున్న ప్రభుత్వం

- వ్యవసాయ, ఉద్యాన యూనివర్సిటీలకు భూకటకట
- భూమి ఇవ్వాలని వర్సిటీలను అడిగిందీ లేదు.. తీసుకున్న తర్వాత కూడా చెప్పిందీ లేదు
- ఏకపక్షంగా ప్రభుత్వ ఉత్తర్వులు
- ప్రత్యామ్నాయంపై చర్చే లేదు
- ప్రభుత్వ వైఖరిపై ప్రొఫెసర్లు, విద్యార్థుల మండిపాటు

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలోని బయోడైవర్సిటీ పార్కు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ఒకరికి సంబంధించిన భూమిని మరొకరు తీసుకుంటే భూ యజమానికి ముందుగా సమాచారం ఇవ్వాలి. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లాగేసుకుంటే అది దాదాగిరి, దౌర్జన్యం అవుతుంది. వ్యవసాయ, ఉద్యాన యూనివర్సిటీలకు సంబంధించిన భూముల విషయంలో ప్రభుత్వం అదే పని చేసింది. రాజేంద్రనగర్‌లో ఈ రెండు యూనివర్సిటీలకు చెందిన స్థలాన్ని చెప్పాపెట్టకుండా ప్రభుత్వం లాగేసుకున్నది. 100 ఎకరాల స్థలాన్ని నూతన హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నది. అయితే ఆ స్థలాన్ని తీసుకుంటున్నట్టు యూనివర్సిటీలకు కనీస సమాచారం ఇవ్వలేదు. పోనీ తీసుకున్న తర్వాతైనా వారికి సమాచారం ఇచ్చారా అంటే అదీ లేదు. భూమి బదలాయిస్తూ డిసెంబర్ 31న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులిచ్చి వారం రోజులు గడిచినా యూనివర్సిటీలకు అధికారికంగా సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. సదరు భూమిలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. అప్పుడు గానీ యూనివర్సిటీ అధికారులకు ఈ విషయం తెలియలేదు. సమాచారం ఇవ్వకుండా భూమిని తీసుకోవడంపై ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంత అధికారం ఉంటే మాత్రం.. ఈ విధంగా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ప్రత్యామ్నాయ స్థలంపై హామీ ఏది?

సాధారణంగా ఏ ప్రభుత్వమైనా శాస్త్ర పరిశోధనలు చేసే సంస్థల నుంచి తమ అవసరాలకు భూమి తీసుకున్నప్పుడు దానికి ప్రత్యామ్నాయ భూమిని చూపించిన తర్వాతే ముందడుగు వేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ఇది జరగలేదు. హైకోర్టు నూతన భవనానికి 100 ఎకరాలు కేటాయించగా, ఇందులో ఉద్యాన యూనివర్సిటీకి చెందిన 57.5 ఎకరాలు, వ్యవసాయ వర్సిటీ భూమి 42.5 ఎకరాలు ఉన్నది. ఆ భూమికి ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని ప్రభుత్వం ఆలోచన కూడా చేయడం లేదు. దీనిపై ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి చర్చ పెట్టలేదు. ఉత్తర్వుల్లో కూడా పేర్కొనలేదు. యూనివర్సిటీలు భూమితోపాటు అందులోని కట్టడాలను కూడా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యాన యూనివర్సిటీకి 57.5 ఎకరాల్లో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కట్టడాలున్నాయి. ఇందులో పలు ఆఫీస్ కార్యకలాపాలతోపాటు ఇతర కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

వ్యవసాయ వర్సిటీకి స్థలమే ప్రాధాన్యం

ఇంజినీరింగ్ యూనివర్సిటీలకు భవనాలు ముఖ్యమైతే వ్యవసాయ సంబంధ వర్సిటీలకు పరిశోధనల కోసం విస్తారమైన భూమి అవసరం. అందుకే ప్రైవేటు రంగంలో వ్యవసాయ వర్సిటీలు ఎక్కువగా ఉండవు. వ్యవసాయ, ఉద్యాన వర్సిటీలకు భూమి లేకుంటే పరిశోధనలు సాధ్యం కాదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం కేటాయించని పక్షంలో పరిశోధనలపై తీవ్ర ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో వ్యవసాయ పరిశోధనలు, వ్యవసాయ విద్య కుంటుపడటం ఖాయమని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీటి ప్రభావం చివరికి వ్యవసాయంపై, రైతులపై పడుతుందని అంటున్నారు.

రెగ్యులర్ వీసీ ఉంటే అడ్డుకునేవారేమో....

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్న ప్రవీణ్‌రావు పదవీ విరమణ చేయడంతో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు వీసీగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్‌రావు పదవీ విరమణ చేసి సుమారు ఏడాదిన్నర అవుతున్నది. ఇప్పటికీ ఆ స్థానంలో రెగ్యులర్ వీసీని ప్రభుత్వం నియమించలేదు. ఒకవేళ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ప్రొఫెసర్లు, విద్యార్థులు అంటున్నారు. వైఎస్ హయాంలో భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తే అప్పటి వీసీ రఘువర్ధన్‌రెడ్డి అడ్డుకున్నారని చెప్తున్నారు. ప్రస్తుతం కార్యదర్శి రఘునందన్‌రావు ప్రభుత్వంలో భాగమే కాబట్టి.. ప్రభుత్వం చెప్పినట్టు చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని యూనివర్సిటీ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

నాడు వైఎస్ వెనక్కి తగ్గితే.. నేడు రేవంత్ ఇచ్చేశారు

వ్యవసాయ వర్సిటీల భూములకు సంబంధించి ఎప్పటి నుంచో సర్కారు కన్ను ఉన్నది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ఫ్లైవర్ కోసం యూనివర్సిటీల భూమిని తీసుకోవాలని ఆయన ప్రయత్నించారు. దీనిపై అప్పట్లో యూనివర్సిటీ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు వైఎస్ వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితిని వివరించారు. ఆ భూమి అవసరాన్ని, భూమి లేకుంటే జరిగే నష్టాన్ని, అక్కడ జరుగుతున్న పరిశోధనలు, పెంచుతున్న వృక్ష జాతులకు సంబంధించి క్షుణ్ణంగా తెలిపారు. దీంతో ఆయన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఏకపక్షంగా యూనివర్సిటీ భూములను అప్పనంగా అప్పగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్ణయం తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

ప్రజాపాలనపై నేడు సీఎం రివ్యూ

- మంత్రులు హాజరుకావాలని పిలుపు
- నెల రోజుల ప్రభుత్వ పాలనపై చర్చ
- నెలాఖరులోగా రాయితీ సిలిండర్
- ప్రజల నుంచి 1.25 కోట్లదరఖాస్తులు
- 17లోగా డాటా ఎంట్రీకి ఆదేశం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన దరఖాస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్ శాంతికుమారితో పాటు వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) డైరెక్టర్ జనరల్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు హాజరవుతారు. ఈ సందర్భంగా ప్రజాపాలనపై ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ prajapalana.telangaana.gov.inను సీఎం ప్రారంభిస్తారు. కాంగ్రెస్ నెల రోజుల పాలనపై శాఖల వారీగా తీసుకున్న నిర్ణయాలు, ఫలితాలను ఈ సమావేశంలో చర్చిస్తారు.

తక్కువ ఖర్చయ్యే రాయితీకే ప్రాధాన్యం

కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్న ప్రభుత్వం ఈ నెలాఖరు నాటికి మరో గ్యారెంటీని ప్రారంభించాలని యోచిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకుని తక్కువ ఖర్చుతో ప్రజలకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా ఒకదానిని ఎంపిక చేసే అంశంపై మంత్రుల బృందం చర్చిస్తుంది. ఇటీవల ఆరోగ్యశ్రీ పరిధిని 10 లక్షలకు పెంచింది. ఈ హామీని నెరవేర్చడం వల్ల ప్రభుత్వంపై ఇప్పటికప్పుడు పడే ఆర్థికభారం పెద్దగా ఉండదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ఇంచుమించు ఇలాంటిదే. ఈ నేపథ్యంలో తక్కువ ఆర్థిక భారం పడేలా రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ పథకం అమలు చేయడం ద్వారా ప్రభుత్వంపై నెలకు రూ.350 కోట్ల భారం మాత్రమే పడుతుంది. రాయితీని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో వేయాలా? లేదంటే, కంపెనీకి చెల్లించాలా? అన్న విషయమై మంత్రుల బృందం నిర్ణయం తీసుకోనుంది. కేంద్రం ఇటీవల వెల్లడించిన గణాంకాల ప్రకారం 2022-23లో తెలంగాణలో 6.67 కోట్ల గృహ వినియోగ సిలిండర్లు బుక్ అయ్యాయి. ఈ లెక్కన ఒక్కో కుటుంబం సగటున ఏడాదికి ఆరు సిలిండర్లు వినియోగిస్తున్నట్టు లెక్క. ఈ నేపథ్యంలో రాయితీని ఆరు సిలిండర్లకు పరిమితం చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం.

అత్యధిక దరఖాస్తులు హైదరాబాద్ నుంచే

ప్రజాపాలనకు సంబంధించి పది రోజుల్లో 1,25,84,383 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. వీటిలో ఐదు గ్యారెంటీలకు 1,05,91,636 దరఖాస్తులు రాగా, ఇతర అభ్యర్థన కోసం 19,92,747 వచ్చాయి. ఒక్క హైదరాబాద్ నుంచే 13.7 లక్షల దరఖాస్తులు వచ్చాయి. 16,392 గ్రామ పంచాయితీలు, 710 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. దరఖాస్తుల డాటా ఎంట్రీని ఈ నెల 17లోగా పూర్తిచేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

నెల రోజుల ప్రస్థానం తృప్తినిచ్చింది

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్వీట్

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రిగా నెల రోజుల తన ప్రస్థానం తృప్తినిచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సీఎంగా బాధ్యతలు స్వీకరించి నెల రోజులైన సందర్భంగా ఆదివారం ట్వీట్ చేశారు. 'పేదల గొంతుక వింటూ యువత భవితకు దారులు వేస్తూ మహాలక్ష్ములు మన ఆడబిడ్డల ముఖంలో ఆనందాలు చూస్తూ రైతుకు భరోసా ఇస్తూ సాగిన నెల రోజుల నడక ఉజ్వల భవిత వైపు అడుగులు వేస్తున్నది. పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామంటూ పారిశ్రామిక వృద్ధికి పెద్దపీట వేస్తూ నగరాల అభివృద్ధికి నగిషీలు చెక్కుతూ మత్తులేని చైతన్యపు తెలంగాణ కోసం గట్టి పట్టుదలతో సాగిన ఈ నెల రోజుల పాలన బాధ్యతగా సాగింది' అని సీఎం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువవుతున్నదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

దరఖాస్తులకు 'ఎంట్రీ' కష్టాలు!

- పదిరోజుల్లో 1.25 కోట్ల దరఖాస్తుల ఆన్‌లైన్ అసాధ్యమే
- ఒక ఆపరేటర్ ఎంత కష్టపడినా రోజుకు 60 మాత్రమే పూర్తి
- ప్రజాపాలన దరఖాస్తులపై సైబర్ నేరగాళ్ల కండ్లు

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో అభయహస్తం కింద 1,05,91,636 దరఖాస్తులు రాగా, రేషన్‌కార్డు, ఇతర అంశాలకు సంబంధించి 19,92747 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు అంతాబాగానే ఉన్నా అసలు సమస్య ఇప్పుడే మొదలైంది. వీటిన్నింటినీ ఈ నెల 17లోగా డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, ఇది సాధ్యమేనా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సీజీజీ అధికారులు అప్లికేషన్ రూపకల్పనలో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో డాటా ఎంట్రీలో సమస్యలు వెంటాడుతున్నాయి. సర్వర్ సమస్యతో అప్లికేషన్ పదే పదే లాగ్ అవుతోందని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఆపరేటర్ రోజుకు 60-75 మించి దరఖాస్తులు చేయలేకపోతున్నాడు. దీనికితోడు ఆధార్‌కార్డు నంబర్‌ను 12 డిజిట్‌లకు పరిమితం చేయకుండా ఎన్ని నంబర్లు ఇచ్చినా తీసుకుంటున్నది. దీనివల్ల ఒక్క నంబర్ తక్కువైనా, ఎక్కువైనా లబ్ధిదారుడు నష్టపోయే ప్రమాదం ఉండడంతో జాగ్రత్తగా ఎంట్రీ చేయాల్సి వస్తున్నది. దీనికి తోడు ఎడిట్ ఆప్షన్ కూడా లేకపోవడం మరింత సమస్యగా మారిందని ఆపరేటర్లు చెప్తున్నారు. దీనికితోడు పండుగ సెలవులు కూడా రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని మరి కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు గ్యారెంటీలకు మాత్రమే డాటా ఎంట్రీ జరుగుతున్నది. రేషన్‌కార్డుల కోసం వచ్చిన 20 లక్షల దరఖాస్తులు అందాయి. వీటిపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

అచ్చం దరఖాస్తులానే వెబ్‌సైట్

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్న ప్రజాపాలన వెబ్‌సైట్ అచ్చం ప్రజలకు అందించిన దరఖాస్తు ఫారంలానే ఉంది. ఒక్కో గ్రామం/వార్డు, మండలం, జిల్లాల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఏయే గ్యారెంటీ కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంతమందికి ఎన్ని గ్యారెంటీలు అమలవుతున్నాయి? అన్న విషయం తెలుసుకునేందుకు డ్యాష్‌బోర్డు అందుబాటులో ఉంది. భవిష్యత్తులో ఎవరైనా తమకు పథకం అమలు కావడం లేదని ఫిర్యాదు చేస్తే సులభంగా తెలుసుకునే వీలుంది.

పొంచి ఉన్న సైబర్ ముప్పు

ప్రజాపాలన దరఖాస్తు మాటున సైబర్ ముప్పు కూడా పొంచి ఉందని, దరఖాస్తుదారులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. మీరిచ్చిన దరఖాస్తు అర్హత సాధించిందని, కాబట్టి పేరు, రసీదు వివరాలు, ఫోన్ నంబర్, బ్యాంక్ వివరాలు చెప్పమంటూ కాల్స్ వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాము పంపే లింక్‌పై క్లిక్‌చేసి నిర్ధారించుకోవాలని, వచ్చే ఓటీపీని చెప్పాలంటూ వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఆరు గ్యారెంటీల్లో ఎన్నింటికి అర్హత సాధించారనే విషయం అధికారులే చెప్తారని, ఎవరికీ వివరాలు చెప్పవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని, https://cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

వేములవాడలోని కోనాయపల్లిలో నిరసన తెలుపుతున్న దళితకాలనీ యువకులు

రామయ్యా అక్షింతలు రాలేదని..

- రోడ్డుపై బైఠాయించిన వేములవాడ దళిత కాలనీ యువకులు

వేములవాడ రూరల్, జనవరి 7: అయోధ్య శ్రీరాముని అక్షింతలు తమ కాలనీకి రాలేదని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని ఎస్సీకాలనీ యువకులు ఆదివారం నిరసనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి బీజేపీ కౌన్సిలర్‌కు వ్యతిరేకంగా నినదించారు. అయోధ్య శ్రీరాముని ప్రతిష్ఠాపన సందర్భంగా శనివారం కోనాయిపల్లిలో ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేసినా.. తమ కాలనీకి రాలేదని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ గడ్డమీది లావణ్యపై మండిపడ్డారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపగా, అక్షింతలు పంపిణీ చేస్తామని కౌన్సిలర్ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఖమ్మం నుంచే సోనియా పోటీ?

- ఖాయమంటున్న కాంగ్రెస్ వర్గాలు
- తెలంగాణయే సురక్షితమన్న నమ్మకమే కారణం
- ఇది టీపీసీసీ ప్రతిపాదనా? ఢిల్లీ పెద్దల వ్యూహమా?

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేయడం దాదాపు ఖాయమైనట్టేనని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. సోనియా ఇక్కడి నుంచి పోటీ చేయాలంటూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేసిన తీర్మానానికి కాంగ్రెస్ పెద్దలంతా సానుకూలంగానే స్పందించినట్టు సమాచారం. సోనియా తెలంగాణ నుంచి పోటీ చేయాలన్న ప్రతిపాదన ఇక్కడి నుంచి వెళ్లింది కాదని, ఢిల్లీ సూచన మేరకే తీర్మానం చేశారని చెప్తున్నారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ.. స్థానాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయాలని పీసీసీ కోరగా, ఖమ్మం నుంచి పోటీకి కాంగ్రెస్ పెద్దలు సుముఖత వ్యక్తం చేసినట్టు సమాచారం.

తెలంగాణ నుంచే ఎందుకు?

సోనియా పోటీ చేయడానికి దేశంలోనే తెలంగాణ సురక్షితమని, అందులో ఖమ్మం మరింత సురక్షితమని కాంగ్రెస్ భావిస్తున్నది. గతంలో ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేసి, విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఖమ్మం నుంచి సోనియా పోటీ చేయడంతో తెలంగాణపైనే కాకుండా పొరుగు రాష్ట్రాలు ఏపీ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకపై కూడా ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు. కర్ణాటక, తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండగా, మొన్నటిదాకా ఛత్తీస్‌గఢ్‌లోనూ అధికారంలో ఉండేది. రాహుల్ కూడా కేరళ నుంచే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో సోనియా కూడా దక్షిణాది నుంచే పోటీ చేస్తే పార్టీకి మరింత ఊపు వస్తుందనేది ఆ పార్టీ అంచనాగా చెప్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉండటం, కర్ణాటక, తెలంగాణలో అధికారంలో ఉండటంతో ప్రస్తుత పరిస్థితుల్లో సోనియా పోటీ చేయడానికి తెలంగాణ అత్యంత సురక్షితమని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్టు చెప్తున్నారు.

ఇక్కడి నుంచే ఎందుకు?

సోనియా ఖమ్మం ఎంచుకోవడానికి బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ స్థానం పరిధిలోని భద్రాచలం మినహా మిగిలిన ఆరు స్థానాలు కాంగ్రెస్ గెలుచుకున్నది. ఇక్కడ కాంగ్రెస్‌తోపాటు కమ్యూనిస్టు పార్టీలకు కూడా పట్టు ఉన్నది. గతంలో ఇక్కడి నుంచి గెలిచిన చరిత్ర బీజేపీకి లేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమిలో వామపక్షాలు కూడా ఉండటంతో సోనియాగాంధీ గెలుపునకు పెద్దగా ఇబ్బంది ఉండదని కాంగ్రెస్ అంచనా వేస్తున్నది. ఖమ్మం నుంచి సోనియాగాంధీ పోటీ చేయని పక్షంలో పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని కమ్యూనిస్టు పార్టీలు కోరే అవకాశం ఉంటుంది. ఆ పరిస్థితి తలెత్తకుండా నివారించేందుకు కూడా సోనియాగాంధీని ఇక్కడి నుంచి బరిలోకి దింపడం పీసీసీ వ్యూహం కావచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడి నుంచి సోనియా గాంధీ పోటీ చేయని పక్షంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సోదరుడికి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌లో పొంగులేటిని వ్యతిరేకించే సీనియర్లు కొందరు వ్యూహాత్మకంగా సోనియా గాంధీని తెరపైకి తీసుకొచ్చి ఉంటారనే ప్రచారం జరుగుతున్నది. అటు వామపక్షాలకు, ఇటు పొంగులేటి కుటుంబానికి ఖమ్మం సీటు దక్కకుండా అడ్డుకునేందుకు సోనియాగాంధీ అభ్యర్థిత్వాన్ని తెరపైకి తీసుకొచ్చి ఉంటారని భావిస్తున్నారు.



హైప్ సృష్టించే వ్యూహం?

అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఎక్కువ సీట్లు గెలుచుకునేందుకు సోనియా ఇక్కడి నుంచి బరిలోకి దించాలన్నది రాష్ట్ర నేతల వ్యూహంగా భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపకపోతే భవిష్యత్‌లో పార్టీ బలహీనపడటమే కాకుండా అధికార పగ్గాలు ఇతరులకు అప్పగించే ప్రమాదం లేకపోలేదు. వీటి నుంచి గట్టెక్కడానికి కూడా సోనియాగాంధీ సెంటిమెంట్‌ను ప్రయోగిస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. వాస్తవానికి వయసు, ఆరోగ్యం రీత్యా సోనియాగాంధీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేరా? అనే సందేహాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ రాష్ట్రం నుంచి సోనియాగాంధీ పోటీ చేస్తారన్న ప్రచారంతో హైప్ క్రియేట్ చేయడం కాంగ్రెస్ వ్యూహమని విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్ పార్లమెంట్ కోఆర్డినేటర్ల నియామకం

- చేవెళ్ల, మహబూబ్‌నగర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని లోక్‌సభ స్థానాలకు కోఆర్డినేటర్లను నియమిస్తూ ఆదివారం కాంగ్రెస్ ఉత్తర్వులు జారీ చేసింది. 17 స్థానాలకు 15 చోట్ల బాధ్యతలను మంత్రులకు, రెండు స్థానాలను మాత్రం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి అప్పగించింది. సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, మంత్రి పొంగులేటికి 2 స్థానాలు కేటాయించింది. సీఎం రేవంత్‌కు మహబూబ్‌నగర్‌తోపాటు చేవెళ్ల నియోజకవర్గ బాధ్యతలను అప్పగించింది. భట్టి విక్రమార్కకు సికింద్రాబాద్, హైదరాబాద్, పొంగులేటికి మహబూబాబాద్, ఖమ్మం, సీతక్కకు ఆదిలాబాద్, శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి, పొన్నంకు కరీంనగర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిజామాబాద్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి జహీరాబాద్, దామోదర రాజనర్సింహకు మెదక్, తుమ్మలకు మల్కాజిగిరి, జూపల్లికి నాగర్‌కర్నూల్, ఉత్తమ్‌కు నల్లగొండ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి భువనగిరి, కొండా సురేఖకు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతలను అప్పగించింది.